AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAYNEWS.COM
11-9-2026 (Friday) MAIN EDITION

## 'బ్రిక్స్'పై శశిథరూర్ కీలక వ్యాఖ్యలు



**అక్షరటుడే, న్యూఢిల్లీ:** బ్రిక్స్ సదస్సుపై కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కూటమి భారత్ దౌత్యపరమైన సమన్వయ శక్తిని చాటుతోందని అన్నారు. ఈ కూటమిని 'గ్లోబల్ సౌత్'కు ఒక ముఖ్యమైన వేదికగా అభివర్ణించారు. గ్లోబల్ సౌత్‌లో 100కు పైగా దేశాలు ఉన్నప్పటికీ, ఇక్కడ ఆ ప్రాంతానికి చెందిన 11 కీలక దేశాలు ఉన్నాయని థరూర్ అన్నారు. మనం వాటికి నాయకత్వం వహిస్తున్నామని వెల్లడించారు. ఈ 11 దేశాల కూటమి ప్రపంచ జనాభాలో అధిక భాగానికి, ప్రపంచ జీడీపీలో 41 శాతానికి ప్రాతినిధ్యం వహిస్తోందన్నారు.

## కాంగోలో ఘోర అగ్నిప్రమాదం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కాంగో దేశంలోని బుకావు నగరంలో జరిగిన భారీ అగ్నిప్రమాదం తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ప్రమాదంలో 26 మంది విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు. మృతి చెందిన వారిలో 19 మంది బాలికలు, ఏడుగురు బాలురు ఉన్నట్లు స్థానిక అధికారులు ధృవీకరించారు. బుకావులోని ఒక నివాస గృహంలో అకస్మాత్తుగా చెలరేగిన మంటలు క్షణాల వ్యవధిలోనే చుట్టుపక్కల ప్రాంతాలకు విస్తరించాయి. ఆ సమయంలో స్కూల్‌స్‌లో విద్యార్థులు ఉండటంతో పెద్దఎత్తున ప్రాణనష్టం సంభవించింది.

## కారంపొడి చల్లి బ్యాంకులో దోపిడీ



అక్షరటుడే, మహారాష్ట్ర: మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో పట్టపగలే ఓ దొంగ బీభత్సం సృష్టించాడు. ఎస్‌బీఐ బ్యాంకులోకి ప్రవేశించి, సిబ్బందిపై కారంపొడి చల్లి రూ.4 లక్షలు ఎత్తుకెళ్లాడు. కారం పొడి చల్లడంతో సిబ్బంది భయంతో పరుగులు తీశారు. క్రైమ్ బ్రాంచ్ పోలీసులు అరగంటలో నిందితుడిని అరెస్ట్ చేశారు.

## బంజారాహిల్స్‌లో కారు బీభత్సం



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ : హైదరాబాద్‌లోని బంజారా హిల్స్ రోడ్డు నెంబర్ 14లో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. వెంకటేశ్వరా ఆలయం సమీపంలో ఆశా ఆసుపత్రి వద్ద మద్యం మత్తులో ఉన్న ఒక యువతీ, యువకుడు వోక్స్ వగన్ కారును అతివేగంగా నడపడంతో రోడ్డుపై వెళుతున్న ఇద్దరు మహిళలను బలంగా ఢీకొట్టారు.

## కుల గణన దేశానికే రోల్ మోడల్ : పొన్నం



అక్షరటుడే, హైదరాబాద్ సిటీ: తెలంగాణ కుల సర్వే దేశానికే రోల్ మోడల్ అని మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. 2027 జనగణనలో బీసీ కులగణన చేర్చాలన్నారు. బీసీల జనాభాపై తెలంగాణ దగ్గర ప్రామాణిక గణాంకాలు ఉన్నాయని చెప్పారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లకు చర్యలు చేపట్టామన్నారు.

**బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఎలాంటి ప్రణాళిక లేకుండా ఐటీ హబ్‌లను నిర్మించడంతో అవి మూతపడే పరిస్థితి వచ్చిందని ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మండిపడ్డారు. అసెంబ్లీలో నిజామాబాద్ ఐటీ టవర్‌పై సభ్యులు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం ఇస్తూ.. యాంకర్ లేదా ఇండస్ట్రీ పార్టనర్స్ భాగస్వామ్యం లేకుండానే వీటిని కట్టడం వల్లే చాలా చోట్ల నిరుపయోగంగా మారాయని స్పష్టం చేశారు. మూతపడిన ఆ ఐటీ హబ్‌లను తిరిగి గాడిన పెట్టేందుకు తమ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని తెలిపారు.**

**- అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి**



# టైర్-2 నగరాలకు
# ఐటీ విస్తరణ

- డేటా సెంటర్లు కీలకం
- ప్రణాళిక లేకుండా ఐటీ హబ్‌ల నిర్మాణం
- శాసన సభలో మంత్రి శ్రీధర్ బాబు

హైదరాబాద్‌పై భారాన్ని తగ్గించే లక్ష్యంతో నల్గొండ, ఆదిలాబాద్, మహబూబ్‌నగర్, కరీంనగర్ వంటి టైర్-2 నగరాలకూ ఐటీ రంగాన్ని విస్తరిస్తున్నామని శ్రీధర్ బాబు వెల్లడించారు. త్వరలోనే ఆదిలాబాద్‌లో ఐటీ టవర్‌ను లాంఛనంగా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. పరిశ్రమల భాగస్వామ్యం ముందుకొస్తే రాష్ట్రంలో మరిన్ని కొత్త ఐటీ హబ్స్ ను అభివృద్ధి చేయడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ఇదే సమయంలో రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి కేంద్రం నుంచి ఎలాంటి సహకారం అందడం లేదని, ఈ విషయంలో బీజేపీ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు.

### లక్ష మందికి ఉద్యోగాలు

రాష్ట్ర యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకెళ్తోందని మంత్రి తెలిపారు. గత రెండేళ్ల కాలంలోనే ఏకంగా 75కి పైగా గ్లోబల్ కేపబిలిటీ సెంటర్లు హైదరాబాద్‌లో ఏర్పాటయ్యాయని, ఇది దేశంలోనే ఒక రికార్డు అని పేర్కొన్నారు. ఈ రెండేళ్లలో లక్ష మంది యువతకు కొత్తగా కొలువులు దక్కాయని వివరించారు. త్వరలోనే సరికొత్త జీసీసీ పాలసీని కూడా తీసుకొస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

### విద్యుత్ ఇబ్బందులు లేకుండా..

ఐటీ రంగానికి వెన్నెముకగా నిలిచే కాంప్రహెన్సివ్ ఎకో సిస్టమ్‌లో డేటా సెంటర్లు కీలకమని శ్రీధర్ బాబు పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో డేటా సెంటర్ల వల్ల తలెత్తే సవాళ్లను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. స్థానికులకు ఎలాంటి విద్యుత్ ఇబ్బందులు కలగకుండా డేటా సెంటర్లకు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పవర్ సప్లై అందించే ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కేవలం పెద్ద నగరాలకే పరిమితం కాకుండా టైర్ 2, టైర్ 3 పట్టణాల్లోనూ డేటా సెంటర్లను ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఐటీ రంగ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు.

## ఆలయంలో చేపలు తిన్న సీఎం..



**అక్షరటుడే, బెంగాల్** : బెంగాల్ సీఎం సువేందు అధికారి ఆలయంలో చేపలు తిన్నారు. దుర్గా పూజ సమయంలో మాంసాహారానికి దూరంగా ఉండాలని బాగేశ్వర్ బాబా సూచించారు. దీనిపై తీవ్ర విమర్శలు వచ్చాయి. బెంగాల్‌లో చాలా మంది దుర్గాపూజ సమయంలో మాంసాహారం తింటారు. అంతేగాకుండా అమ్మవారికి మాంసాహారం నివేదిస్తారు. బాబా వ్యాఖ్యలపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సీఎం సువేందు అధికారి కాళీఘాట్ ఆలయంలో స్వయంగా చేపలతో వండిన ఆహారాన్ని తినడంతో వివాదానికి ఫుల్ స్టాప్ పెట్టారు. కాళీ దేవికి చేపలు, బలి ఇచ్చిన మేక మాంసాన్ని నైవేద్యంగా సమర్పించడం కాళీఘాట్ సంప్రదాయం.

## రేవంత్‌పై కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు



**అక్షరటుడే, హైదరాబాద్** : తెలంగాణలో కాంగ్రెస్ పాలన భూముల దోపిడీకి అడ్డాగా మారిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో 22ఏ నిషేధిత భూముల అంశంపై పార్టీ ముఖ్య నాయకులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రభుత్వ బాగోతాలు, అక్రమాలు ఎక్కడ బయటపడతాయోనన్న భయంతోనే తమను అసెంబ్లీ నుంచి సస్పెండ్ చేశారని ఆరోపించారు. రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యం పేరుతో యథేచ్ఛగా ల్యాండ్ మాఫియా చెలరేగిపోతోందని విమర్శించారు. బీఆర్‌ఎస్ హయాంలో 22ఏ కింద కేవలం 16 లక్షల ఎకరాలు మాత్రమే నిషేధిత జాబితాలో ఉండగా.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక దాన్ని ఏకంగా కోటి 16 లక్షల ఎకరాలకు పెంచారని ధ్వజమెత్తారు. 'తమ్ముడు లెట్స్ డూ కుమ్ముడు' అన్నట్లుగా సీఎం కుటుంబ సభ్యులు దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు.

## రిటైర్డ్ ఆర్మీ అధికారి అరెస్ట్




**అక్షరటుడే, సికింద్రాబాద్** : సికింద్రాబాద్ పరిధిలోని బొల్లారంలోని మద్రాస్ రెజిమెంట్ ఆయుధగారం నుంచి 12 ఆయుధాల చోరీ కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. కీలక నిందితుడు ఒక రిటైర్డ్ ఆర్మీ అధికారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు. రెండు నెలల క్రితం ఉద్యోగ విరమణ చేసిన ఆర్మీ అధికారి ఈ చోరీలో కీలక పాత్ర పోషించినట్లు గుర్తించారు. అతడితో పాటు సహకరించిన మరో ఇద్దరిని అరెస్ట్ చేశారు. గురువారం రాత్రి అతడి నివాసంలో సోదాలు చేసి ఆయుధాలు, మ్యాగజైన్లు, తూటాలు, బైనాక్యులర్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

## మహారాష్ట్రలో ఘోర ప్రమాదం



**అక్షరటుడే, మహారాష్ట్ర** : మహారాష్ట్రలోని భండారా జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు పిల్లలతో సహా ఎనిమిది మంది మృతి చెందారు. నాగ్‌పూర్‌రాయ్‌పూర్ జాతీయ రహదారిపై ఉన్న పింపల్‌గావ్ రోడ్డు ప్రాంతంలోని 'భావు ధాబా' సమీపంలో ట్రక్, వ్యాన్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



## రాజమౌళి, మహేష్ బాబుకు ఈసీ నోటీసులు

**అక్షరటుడే, సినిమా డెస్క్:** తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ప్రముఖులకు ఎన్నికల సంఘం నుంచి ఊహించని షాక్ తగిలింది. నగరంలోని పలువురు సినీ, క్రీడా, వ్యాపార రంగాల ప్రముఖులకు ఈసీ అధికారులు నోటీసులు జారీ చేశారు. ముసాయిదా ఓటర్ల జాబితా ప్రచురణ అనంతరం క్షేత్రస్థాయిలో నిర్వహించిన తనిఖీల్లో పలువురి పేర్లలో భారీగా వ్యత్యాసాలు బయటపడ్డాయి. డైరెక్టర్ ఎస్ఎస్ రాజమౌళి, హీరో మహేష్ బాబు, ఆయన సతీమణి నమ్రత శిరోద్కర్, ప్రముఖ నటుడు వెంకటేష్ దగ్గుబాటి, ఆయన కుమార్తెలకు ఈసీ నోటీసులు ఇచ్చింది. అలాగే నటి సమంత, రౌడీ హీరో విజయ్ దేవరకొండ, ఆయన సోదరుడు ఆనంద్ దేవరకొండలకు కూడా నోటీసులు అందాయి. అయితే వీరికి ఈసీ వ్యక్తిగత హాజరు నుంచి మినహాయింపు ఇచ్చింది.

## రైతులకు కరెంట్ కష్టాలు..

**అక్షరటుడే, హైదరాబాద్** : రాష్ట్రంలో రైతులు కరెంట్ కష్టాలతో ఇబ్బందులు పడుతున్నారు. వ్యవసాయానికి సరిపడా విద్యుత్ సరఫరా చేయకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గత 20 రోజులుగా వానలు లేవు. ఎండలు దంచి కొడుతున్నాయి. ప్రస్తుతం వరి పంట పొట్ట, ఈనిక దశలో ఉంది. ఈ సమయంలో నీరు ఎక్కువ అవసరం. అయితే వర్షాలు లేకపోవడంతో రైతులు బోరుబావులపై ఆధార పడుతున్నారు. రోజుకు 8 నుంచి 12 గంటల లోపు మాత్రమే త్రీ ఫేస్ కరెంట్ ఉంటుంది. దీంతో నీరు పారక పొలాలు ఎండిపోతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.





## ప్రేమ వివాహం.. అబ్బాయి ఇల్లు కూల్చివేత

**అక్షరటుడే, మహబూబ్‌నగర్** : కులాంతర ప్రేమ వివాహం చేసుకున్నారని యువకుడి ఇంటిని యువతి కుటుంబసభ్యులు కూల్చేశారు. ఈ ఘటన గద్వాల జిల్లాలో చోటు చేసుకుంది. గద్వాల్ రూరల్ మండలం రేపల్లె గ్రామానికి చెందిన రంగముని (26), అదే గ్రామానికి చెందిన మహేశ్వరి (21) కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. వీరు బుధవారం పెళ్లి చేసుకున్నారు. అనంతరం రక్షణ కోసం పోలీసులను ఆశ్రయించారు. దీంతో యువతి బంధువులు ఆగ్రహంతో యువకుడి ఇంటిని ధ్వంసం చేశారు. ట్రాక్టర్లు, గడ్డపారలతో ఇంటిని కూల్చివేశారు. అక్కడే ఉన్న రంగముని చిన్నాన్న ఇంటిని కూడా కూల్చేశారు.

## రేపటి నుంచి బ్రిక్స్ సదస్సు.. ఢిల్లీలో భద్రత కట్టుదిట్టం

**అక్షరటుడే, ఢిల్లీ** : బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సమావేశం సెప్టెంబర్ 12, 13 తేదీలలో భారత్ మండపంలో జరగనుంది. దీంతో ఢిల్లీలో భద్రతను కట్టుదిట్టం చేశారు. పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. పలువురు దేశాధినేతలు, విదేశీ ప్రతినిధి బృందాలు, ఉన్నత స్థాయి ప్రముఖులు జాతీయ రాజధాని మీదుగా ప్రయాణించనున్నారు. దీంతో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీగా మోహరించారు. విదేశీ ప్రముఖులు వెళ్లే మార్గాలు, సదస్సు జరిగే ప్రాంతాల్లో భద్రతను కట్టుదిట్టం చేశారు. సదస్సుకు సంబంధించిన ఏర్పాట్ల కోసం సుమారు 4,800 మంది ట్రాఫిక్ సిబ్బందిని మోహరించారు.

